# ఆతిథ్యమూ-ఆద్యంతాలూ

భార్య సామ్రాజ్యమ్మను బండెక్కించి ఇంటికొచ్చాడు అచ్యుతరామయ్య. ఆయన అత్తగారి ఆరోగ్యం ఏమంత కులాసాగా లేదని వారం రోజులలో మూడు కార్డులూ, రెండు కవర్లూ రావడం చేత అచ్యుతరామయ్య తాత్కాలిక భార్యా వియోగానికి గురి కావలసి వచ్చింది. ఆ మాటకొస్తే ఆయనది - భార్యావియోగం విరహమై మథనపెట్టే వయసు కాదనుకోండి.

అచ్యుతరామయ్య స్టేషనునుంచి ఇంటికొచ్చి కాళ్ళు కడుక్కుంటున్నాడు. పక్కవాటాలో కాపురమున్న మోహన్, అచ్యుతరామయ్యని పలకరించాడు, 'మామయ్యా' అంటూ.

నోటమాటంటూ వచ్చిన నాటినుంచీ కాస్త పెద్దగా వున్న మగవారిని 'మామయ్యా' అనీ, ఆడవారిని 'అత్తయ్యా' అని పిలవడం మోహన్‌కు అలవాటు. అలాగే ఒక్కసారి మిషన్ స్కూల్లో మూడోతరగతి టీచరమ్మ మేరీ కన్నమ్మను మోహన్ ముద్దుముద్దుగా 'అత్తయ్యా' అని పిలిస్తే 'మొద్దువెధవా! ఎవతెరా నీ అత్తయ్యా?' అని ఆ టీచరమ్మ మొట్టికాయలు పెట్టిన సంగతి, మాంచి ఖుషీలో వున్నప్పుడు మోహన్ యిప్పటికీ చెబుతూవుంటాడు. అదికాక పెళ్ళయిన కొత్తలో 'అత్తయ్యా' అని మోహన్ ఎవరినయినా పిలిచినపుడల్లా అతగాడి అర్ధాంగి సుగుణ కారంతో చూసేది. కానీ రోజులు గడచినకొద్దీ అతడలా పిలవడంలో తను కోప్పడాల్సిన అగత్యం ఏమాత్రం లేదుగనుక మోహన్ ఆవిడను 'అత్తయ్యా' అనికాక 'అత్తత్తయ్యా' అని పిలిచినా అందువలన మూడే కీడేమీ లేదన్న సత్యం తెలుసుకుంది సుగుణ.

"అత్తయ్యకు పెట్టెలో కూచునేందుకు చోటుదొరికిందా మామయ్యా?" ఏదో మాటవరసకి పలకరించాడు మోహన్‌రావు.

"ఆ... దొరికిందోయ్ మోహనం!" పేర్ల పక్కన పూర్ణానుస్వారం చేర్చడం అచ్యుతరామయ్యగారి ప్రత్యేకత. మోహన్‌రావుని 'మోహనం' అనీ, అతడి భార్యని

'సుగుణం' అనీ పిలిచేవాడు. వాళ్ళ నాన్న అయన్ని 'ఒరేయ్ అచ్యుతం' అనేవాట్ట.

'చోటుదొరక్క పోయేట్టయితే నేనెందుకూ ఊచలూడిన గొడుగులా? ఫస్టుక్లాసు సీటు... కిటికీ పక్క నే, చూసి కూచోపెట్టాను మీ అత్తయ్యను. ఆ పక్క నే ఇంకో అమ్మాయీ అబ్బాయీ వున్నారు; బెజవాడ వెళుతున్నారు. వాళ్ళతో చెప్పే వచ్చా మీ అత్తయ్యని చూసుకోమని. పొద్దున్నే అరింటికల్లా వాళ్ళమ్మ పక్కనుంటుంది మీ అత్తయ్య.' అయనకంటూ బుద్ధి పుట్టాలేగానీ అటంబాంబునుండి ఆవకాయదాకా విసుగుపుట్టకుండా మాట్లాడేవాడు అచ్యుతరామయ్య.

ఇంతలోకి ఆ ప్రక్కన సుగుణ వచ్చి నుంచుంది. తెచ్చిపెట్టుకున్న భయభక్తులతో నెమ్మదిగా ఇలా అంది: 'ఏమండీ! మిమ్మల్నే... మామయ్య నీ పూట మనింట్లో భోంచేయమనండీ... అత్తయ్య కూడా లేదుగా–'

అవునని మోహన్ అనబోతూండగానే అచ్యుతరామయ్య 'అందుకేమమ్మా... అలాగే! అలా అప్యాయతతో పిలిచేవాళ్ళుండాలేగానీ.... ' అన్నాడు.

ఆరోజు సెప్టెంబరు మూడో తారీఖు రాత్రి అచ్యుతరామయ్య సుగుణా మోహన రావులకు అతిథి అయాడు.

సుగుణ వడ్డిస్తూ ఉంది.

'అహా ఈ బెండకాయల కూర అద్భుతం! నీవు ఇంతబాగా వంటచేస్తావు టమ్మా సుగుణం!' అన్నాడు అచ్యుతరామయ్య. గర్వంతో సిగ్గుపడింది సుగుణ. అచ్యుతరామయ్య విస్తట్లో మరింత కూర వడ్డించింది.

ఇంకొంతసేపు తర్వాత.

'ఉల్లిపాయల పులుసులో ఇంత మాధుర్యం వుందా? మోహనం! ఇలాటి పెళ్ళాం దొరికేందుకు ఎంత పుణ్యం చేసుకున్నావోయ్! మీ అత్తయ్యా చేస్తుంది వంట' అంటూ బి.ఎ., పరీక్ష ఏడోసారి తప్పినవాడిలా మొహం పెట్టాడు అచ్యుతరామయ్య.

నెత్తిమాద అరటన్ను ఐసు పెట్టినట్టు ఫీలయింది సుగుణ. మోహనరావు కిదేమీ సరిపడలేదు. 'ఈ ముసలాయన సుగుణనిలా 'సుగుణం, సుగుణం' అంటూ అందలానికెత్తేస్తున్నాడే ఇదేమి దుర్గుణమూ?' అనుకున్నాడు. అయినా బయటికి మాత్రం "హి–హి–హీ... ఆ ... ఏదో లెండి" అన్నాడు, సుగుణ వైపు చూస్తూ.సుగుణ విప్పారిన నేత్రాలతో చూసింది భర్తను.

అచ్యుతరామయ్య చేయి కడుక్కుంటూండగా సుగుణ బిగ్గరగా 'ఏమండీ! రేపు అదివారమే కదా మామయ్యను రెండుపూటలా మనింట్లోనే భోజనం చెయ్యమనండీ' అంది. 'ముసళ్ళపండగ ముందున్నట్టుందిరా దేవుడా! ఈ పిచ్చిపిల్ల ఈయన పొగడ్తలకు మూర్ఛపోయింది కదా!' అనుకున్నాడు మోహనరావు.

ఇంతలో మోహన్ ప్రమేయం లేకుండానే అచ్యుతరామయ్య " అంతకంటేనా?" అనడం, సుగుణ సగర్వంగా మోహన్ వంక చూడడం జరిగిపోయాయి.

మోహన్ మాటాడకుండా వెళ్ళి ఈజీచేరులో కూర్చున్నాడు.

ఆదివారం పొద్దున సుగుణ పిండివంటలతో సహా వండింది వంట. 'ఏవిటిదంతా' అని మోహన్ అడిగితే 'తండ్రిలాంటివాడు ఆయన. మనం పిలిచినా అలాటి అతిథి వస్తాడుటండీ?' అంది సుగుణ మైసూరుపాకు ముక్కలు కోస్తూ. "హా గృహిణీ!" అనబోయిన మోహనరావు మైసూరుపాకు సువాసనతో ఆగిపోయాడు.

సోమవారం పొద్దున తొమ్మిదయింది. మోహన్ పేపరు చదువుకుంటున్నాడు. అచ్యుతరామయ్య గబగబా వచ్చి 'అబ్బాయ్ మోహనం... ఘంట తొమ్మిదయితే ఇంకా కూర్చున్నావేం? అదేమిటోనోయ్ రిటైరయినప్పటికీ నాకు తొమ్మిదికొడుతూంటే ఇలా విస్తరి ముందు కూచోవడం అలవాటు ఆ ఏది ఏమయినా సరే' అని హావభావ విలాసాలతో, నొక్కి వక్కాణించి 'అమ్మాయ్, ఇంకా వంట కాలేదూ? వడ్డించవమ్మా. అరిటాకు లెక్కడున్నాయ్?' అంటూ వంటింటి లోపలికి పోయాడు అచ్యుతరామయ్య.

పేపరలా పడేసి నోరు అర్ధశేరు గొట్టంలా తెరచి వంటింటివైపు చూశాడు మోహనం! 'ప్రాణముల్ ఠావుల్ దప్పె'నన్న గజేంద్రుడు గుర్తుకొచ్చాడు.

ఆరోజు సాయంకాలమూ అదే వరస.

ఎనిమిదింటికల్లా వీరి వాటాలోకొచ్చి తానే పీటలూ అవీ అమర్చి, మోహనరావుని భోజనానికి లేపాడు అచ్యుతరామయ్య.

సుగుణ వడ్డించింది. బొమ్మలా విస్తరిముందు కూచున్నాడు మోహన్. అన్నం కలపబోతున్నాడు. 'అదేవిటబ్బాయ్, సంధ్యా, వార్చూ లేకుండానే!' పొద్దునంటే ఆఫీసు తొందర కానీ--' అని మందలించాడు అచ్యుతరామయ్య. అంత రాత్రివేళ బలవంతపు మాఘ స్నానంలా సంధ్య వార్చాడు మోహనరావు. సంధ్యావందనం కింద పంచపాత్రలో నీరు కింద పోసినంత సేపూ అచ్యుతరామయ్యని మనసార తిట్టుకున్నాడు మోహన్.

భోజనాలవుతున్నాయి.

'అమ్మాయీ సుగుణం, అన్నం కాస్త చల్లారినట్టుందే?'

'అవును మామయ్యా, నాలుగింటికల్లా కాఫీ కుంపట్లోనే అన్నం కూడా వండేస్తాను.'

'అబ్బే ! అదేంపనమ్మా? రాత్రిపూట భోజనానికి అన్నీ వేడిగానే వుంటేనే బావుంటాయి. అందుకనే మీ అత్తయ్య సాయంకాలం ఆరింటికి మొదలుపెట్టేది వంట' అన్నాడు అచ్యుతరామయ్య.

'నీకు బాగా కావలిసిందేలే' అన్నట్టు మోహన్ సుగుణవైపు చూశాడు. సుగుణ నేత్రాలు విస్ఫారితాలుగా లేవు, ఆమె ముఖంలో గర్వమూలేదు.

ఆ రాత్రి పడక గదిలో–

'ఏమండి ....' సుగుణ స్వరమే ప్రతిధ్వనించింది.

'ఏమండోయ్!'

'ఓయ్....?'

'నిద్రపోతున్నారా?'

'అవును.'

"ఏడ్చినట్టుంది జవాబు. అయినా ఈయన ఇలా చేస్తున్నారే" అంది సుగుణ.

'ఎవరాయన? ఎలా చేస్తున్నాడూ?' అంటూ లేచి మోకాళ్లమీద మొహమానించి కూచున్నాడు మోహనరావు.

'అబ్బ! ఏమీ తెలియనట్టే, ఆయనే మీ మా...మ...య్య...' అంది సుగుణ.

'అబ్బే....మా....మా....య్య కాదు. మనకు అతిథి. తండ్రిలాటివాడు.'

'అవును, వేళాకోళాలకిదే టైము కాబోలు'

'మరి పగటిపూటంతా నీకు అతిథులకు మైసూరు పాకం చేసి పెట్టడంతోనే సరిపోతుండె.'

'అవునవును. ఎంతసేపూ మీకు నన్ను ఏడిపించడం తెలుసు.'

'నేను నిన్నుకాదు ఏడిపించడం... మనిద్దరినీ కలిపి ఏడిపించబోతున్నా డొకాయన.'

'ఏవండీ!'

'ఆ.'

'అట్లా ఆ అని ఊర్కుంటారేం....'

'మరి ఈ అర్ధరాత్రిపూట ఏం చేయమంటావ్?'

'రేపు పొద్దున ఆయనతో చూచాయగా చెప్పండీ.'

'ఏమనీ?'

'భోజనానికి రావద్దని.'

'భేష్! తలుపుచాటున నిల్చుని అన్నపూర్ణలా అందరినీ రండీ! మాఇంట్లో భోంచేయండీ!' అనడం నీవంతూను, 'ఏమండోయ్! భోజనానికి మీరు మా ఇంటికి రాబోయేరు, జాగ్రత్త!' అనడం నావంతూనా?'

'అయితే మరి మొట్టమొదటే వీల్లేదు అనలేక పోయారా?'

'నీవేమో, అత్తయ్యలేదని ఒకసారీ, ఆదివారమని మరొకసారీ ఆహ్వానించడం, ఆయన శరవేగంతో అంగీకారం తెలపడం జరిగిపోతుంటే, మధ్యవచ్చి నుంచుని అపశ్రుతిలా నేను వీల్లేదనడమా?'

'ఏవిటోనండీ ఎలాగయినా మీరు.'

'అబ్బెబ్బె! నావలన అలాంటి దేమీ'

మోహన్ తల దువ్వుతూ 'ఏ...మం...డీ' అంది సుగుణ వినీ వినపడకుండా.

'పడుకో సుగుణా పొద్దున చూసుకుందాం' అని బుజ్జగించాడు మోహనరావు.

'రేపు అమ్మాయితో ఏం వండమని చెబుదామా!' అని ఆలోచిస్తూ పడుకున్నాడు పక్క వాటాలోవున్న అచ్యుతరామయ్య!

మరుసటిరోజు ఉదయం.

మోహన్ అచ్యుతరామయ్య వాటాలోకి వెళ్ళాడు.

'ఆ.....మోహనమా? రావోయ్ రా' అని ఆహ్వానించాడు అచ్యుతరామయ్య. స్తంభాన్నానుకుని నిల్చున్నాడు మోహనరావు.

'ఏమిటోయ్ బజారుకు బయలుదేరావేమిటి? ఏం కూరలు తెస్తావు? నాకు కాకరకాయలుతప్ప ఇంకేదయినా ఫరవాలేదు....'

'అబ్బే కాదు మామయ్యా' అంటూ మోహన్ కుర్చీలో కూచునేసరికి 'కాకరకాయలు తెచ్చే శావా, ఏం? అన్నట్టు కళ్లజోడుగుండా చూశాడు అచ్యుతరామయ్య.'

గొంతు సవిరించుకున్నాడు మోహనరావు. 'నాకు స్నేహితులంటే మహ ఇష్టం మామయ్యా!'

'అది ఉండాలోయ్. ఉండి తీరాలి.'

'వాళ్లకోసం ప్రాణాలయినా వదిలి పెడతాను.'

'వదలాల్సిందే! వెధవ ప్రాణం స్నేహితులతో సమానమా? ఉదాహరణకి నాకు నీవంటే' అని అచ్యుతరామయ్య అంటుండగానే, మోహన్ ఇలా అన్నాడు. 'అలాటి ప్రాణ స్నేహితుల్లో ఒకతనికివాళ పెళ్ళి–'

'ఓహో ఓహో!.... చాల మంచిది. అందులో ఇవాళ బ్రహ్మాండమయిన ముహూర్తం కూడానూ.'

'నన్ను తప్పక రమ్మన్నాడు.'

'అవును మరి, రమ్మనడూ?'

'రెండుపూటలూ భోజనం అదీ అక్కడే చేయమని ప్రాణం తీశాడు.'

'ఆహా! వెళ్ళాలిసిందే తప్పకా! స్నేహితుడు తన పెళ్ళిలో భోజనానికి రమ్మంటే పోకుండా వుండడమా. ... ఉహూ నే నొప్పుకోను.'

'అందుచేత నేనుమాత్రం వెళ్ళడం ఎందుకని సుగుణనికూడా తీసుకువెడుతున్నాను'

'వెళ్ళిరండోయ్! కుఱ్ఱవాళ్ళు జీవితంలో ఇలాటి సరదాలన్నీ ఇపుడే'

'కాబట్టి మీరేమో పాపం మీకు ఆహ్వానంలేదు కాబట్టి మీరు పెళ్ళికి రా–రు–గా' ఇంత మాత్రం మాట్లాడ గలిగినందుకు 'భళిరా మోహన్' అని మనసులో వీపు తట్టుకున్నాడు మోహనరావు.

'అవునోయ్ నే నెలా వస్తానూ? ఏదీ మాటవరసకీ మీరు రండీ అంటే వద్దు నేమో, కానీ ఇపుడెలా?'

'అంచేత మీ భోజనం.... మరి?'

'నా భోజనాని కేమిటోయ్! కంది పచ్చడీ, మిరియాల చారూ ఉంటే చాలు. ఎటూ ఆవకాయ వుండనేవుందిగా! అమ్మాయితో ఆ మాట చెప్పు. నేనే వడ్డించుకు తింటాలే'

' ఊ! అ లా గే ' అంది మోహనరావు గొంతు.

అఖండమయిన అపజయాన్ని మోసుకుని తమ వాటాలో అడుగు పెట్టాడు అతిధి భారంతో కుంగి పోయిన అభాగ్యుడు మోహన్.

'ఏమండీ! వదిలిందా?' అంటూ ఎదురయింది సుగుణ.

'కంది పచ్చడీ, మిరియాల చారూ చాలుట, అవకాయ వుండనే వుందిట తనే వడ్డించుకుని తింటాడుట' అని కుర్చీలోకి జారిపోయాడు మోహన్.

అక్కణ్ణుంచి ఘంటసేపు వంటింట్లో నుండి, అపుడపుడు రేడియోలో వస్తున్నట్టు నానా విధశబ్దజాలాలూ బయలు దేరాయి. కంచు పాత్రలు ఖణఖణ మోగాయి. పళ్ళాలు పోటీలు వేసుకుని కింద దొర్లాయి. కుంపట్లో మిరపకాయలు దూకాయి. ఏదో సద్దు అణిగిన తర్వాత కంది పచ్చడీ, మిరియాల చారూ కనపడ్డాయి వంటింట్లో.

అచ్యుతరామయ్యకు అన్నీ అమర్చి, తాళం చెవులాయన చేతికిచ్చి, వీధిలో పడి హోటల్లో ఇన్ని మెతుకులు గతికి, 'జూ' కు వెళ్ళి మధ్యాహ్నం మౌంట్ రోడ్డులో కాఫీ కానిచ్చుకుని, సాయంకాలం 'మ్యూజియంకి' వెళ్ళి, దారిలో భోంచేసుకుని రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరుకున్నారు సుగుణా మోహనులు.

ఇంటికి రాగానే 'అమ్మాయ్! ఇవాళ పెట్టావే చారు మహా బాగుందిలే' అంటూ ఎదురయాడు అచ్యుతరామయ్య, మోహన్ వైపు తిరిగి 'ఎలా వుంది మీ ఫ్రెండు పెళ్ళి?' అని అడిగాడు.

'చక్కగా వుంది'

'పొద్దున్న ఏం స్వీట్లు చేశారూ?'

'బాంబే హల్వా, ముఖమల్ పూరీ.....' అని మోహన్ రావు చేతకాక కోతలు కోస్తుంటే కళ్ళ నీళ్ళు అపుకోలేక సుగుణ పడక గదిలోకి వెళ్ళిపోయింది.

ఇంకా మూడు రోజులు గడిచాయి. అతిథి రూపంలో ఆవాహన మయిన శనిని వదిలించుకోవడమెట్లా అన్నది పెద్ద సమస్య అయి పెనుభూతమై పీడించుకుని తింటున్నది యువ దంపతులిద్దరిని. పరిష్కార విధానాలు ఆలోచించి, పథకాలు వెతికి, ప్రణాళికలు నిర్ణయించుకుని సతమతమయ్యారు.

శనివారం సాయంకాలం ఆఫీసునుండి త్వరగా వచ్చేశాడు మోహనరావు.

అచ్యుతరామయ్య హాల్లో కూచుని పంచాంగం చూసుకుంటున్నాడు. అది చూడగానే మోహనరావుకు చక్కటి ఉపాయం తోచింది.

'ఏం మామయ్యా! ముహూర్తం చూస్తున్నారా బయలుదేరడానికి?'

'ఎక్కడికీ బయలుదేరడం?'

'ఎక్కడికంటారేమిటీ? సామ్రాజ్యమ్మత్తయ్యని పిలుచుకు రావడానికి వెళ్ళరూ?'

'లేదోయ్ ఇంకో వారం రోజులలో వస్తున్నానని మొన్న రాసిందిలే మీ అత్తయ్య.'

'ఇక్కడ మనమోహనం సుగుణలు నన్ను తండ్రిలాగా చూసుకుంటూ చాల సహాయంగా వుంటున్నారు. కనక నేను ఇబ్బంది పడుతున్నానేమో అని దిగులు పడవద్దు. తొందరేమీ లేదు గనుక నీవు ఇంకో మాసం రోజులపాటు అక్కడే వుండి సావకాశంగా రావచ్చు అని ఆ నాడే రాసిపడేశా' అని అతి ఉత్సాహంతో ప్రకటించాడు అచ్యుతరామయ్య.

'ఓ హో అలాగా' అని ఎంగిలి మింగాడు మోహనరావు, అయినా వదలలేదు ప్రయత్నం.

'అది కాదు మామయ్యా! మీ అత్తగారి ఆరోగ్యం అలా వుందికదా ఒక్కసారి మీరు వెళ్ళి చూసి వస్తే బాగుంటుందేమో '

'ఆ నేనెందుకూ మీ అత్తయ్య ఉందిగా'

'అయినా ముసలి ప్రాణం ఏనాడయినా హరీ మనవచ్చు' అని మోహనరావు బెదురుతూ బెదురుతూ అనగానే అచ్యుతరామయ్య పెద్దగా నవ్వాడు.

'ఎవరూ? మా అత్తగారా! ఉహూ ఎప్పటికీ కాదు. ఆమె అలా చచ్చే మనిషి కాదోయి మోహను..... నెల రోజులకింద ఒక జ్యోతిష్యుడికి ఆమె జాతకం చూపిస్తే 'ఈవిడకు ఇంకా ఇరవై ఏళ్ళవరకూ చీమకూడా కుట్టదని ఢంకామీద దెబ్బ కొట్టి చెప్పాడు.'

'ఓహో'

'అదీకాక ఆమె ఇలాటి జ్వరాలూ జలుబులూ వీటికి పోయే ఘటం కాదుట. ఆమెకి ఇరవై సంవత్సరాలూ నాలుగు నెలలూ, మూడు రోజులు గడిచిన తర్వాత జలగండం వుందిట'

'ఆ గండమేదో మీకు ఇప్పుడు రాకూడదా' అనుకున్న మోహన్ కాసేపు ఇంకేదో మాట్లాడి లేచి వెళ్ళిపోయాడు.

సుగుణ 'కోరి కోరి కొరివిని తెచ్చుకున్నాం కదా' అని ఏడవకుండా ఏడిచింది. మోహను మెదడు వేడెక్కి పోయింది.

మరుసటి రోజు పొద్దున సుగుణ ఒక పన్నాగం పన్నింది. సత్యాగ్రహం మొదలుపెట్టింది. జ్వరమని ముసుగుపెట్టి పడుకుంది. ఇంట్లోవంటే లేకపోతే అతిథి 'అలో రామచంద్రా' అని నెత్తిమీద గుడ్డ వేసుకుని పోక తప్పదుకదా అనుకున్నాడు మోహన్. లలలా-లా-లా అని పాడుకుంటూ అచ్యుతరామయ్య వాళ్ళ వాటాలో అడుగుపెట్టాడు. ఇవాళతో ఇహ తీరిపోయిందిరా కృష్ణ పక్షం అన్న ఉత్సాహం కొద్దీ నూతన రీతిలో దాడి మొదలెట్టాడు.

'మామయ్యా'

'ఏమోయ్?'

'ఇవాళ....సుగుణకి'

'ఏం పుట్టిన రోజా?'

'కాదు మామయ్యా, సుగుణకి జ్వరం. తను తిందట. అబ్బే కాదు కాదు జ్వరం తగిలింది'

'ఏం జ్వరం? చలి జ్వరమా అలసట మీదట జ్వరమా లేక-?'

'ఆ....అదే....ఏదో ఒకటి మొత్తంమ్మీద జ్వరమ్మాత్రం మాంచి తీవ్రంగా వచ్చేసింది. నొసట తాకి చూస్తే కుంపటిమీద చేయి పెట్టి నట్టుంది...'

'పాపం!'

'మరి ఇపుడు ఏం చేయడమో ఏమీ బోధపడకుండా వుంది మామయ్యా'

'పిచ్చి అబ్బాయివిగాని అందుకే దిగులుటోయ్ మోహనం! ఏం శీతాంశు రసాయనమో రెండు మాత్రలిస్తే సాయంకాలానికి అమ్మాయి లేచిమని'

'అబ్బే అవన్నీ'

'పోనీ అలోపతీ డాక్టరునే పిలుద్దాం'

'అది కాదు మామయ్యా నే చెప్పేది ఏమిటంటే దాని జ్వరానికి మందులే అక్కర్లేదు ఒక రోజల్లా అలా వుంటుంది. మరుసటి రోజు తనంతటతానే లేచి కులాసాగా తిరుగాడుతుంది.'

'అయితే నీవు అడుగుతున్నదేమిటి?'

'మన భోజనం మరి ఇవాళ మనం హోటలులో భోంచేయాల్సి నట్లుంది.'

'ఏమిటీ? హోటల్ భోజనమా? కల్పవృక్షం లాటి ఇల్లుండగా అదెందుకూ? అన్నాడు అచ్యుతరామయ్య. 'అసలు కల్ప వృక్షానికి కూడా చెద పురుగువయ్యా' అనుకుని మోహన్ 'నిప్పురాజెయ్యడం కూడా నాచేత కాదుగా!' అన్నాడు.

'ఆ మాట గట్టిగా అనకు. ఎవరయినా నవ్వుతారు. ఈ కాలంలో మగవారికి వంట రాకపోవడమేమిటీ? నీవు పదవోయ్ నేను వండుతాను. ఎంచక్కా చేస్తానో చూడు రా' అంటూ సగం చచ్చిన మోహనరావు చేయి పట్టుకుని వంటింట్లోకి లాక్కెళ్ళాడు అచ్యుతరామయ్య.

వీళ్ళిద్దరూ వంటింట్లోకి వెళ్ళడం చూసి ఉక్రోషం పట్టలేక సుగుణ తన్నిన తాపుకి కాలిదగ్గర టేబిల్ మీద వున్న గ్లాసొకటి గలగలమని చప్పుడు చేసింది.

వంటింటిలో

'ఇదిగో అబ్బాయ్ ఆ చాటతో బొగ్గులు పట్రా.'

'మోహనం కాస్త ఆ పొట్లకాయ బిళ్ళలు బిళ్ళలుగా తరుగు'

'ఆ మిరియాల డబ్బా ఇలా తే'

'బావినుండి ఓ బిందెడు నీళ్ళు వెంటనే'

'ఈ కుంపటి కాస్త విసురు'

ఈ విధంగా వంటింటిలో గరిటె చేతబూనిన విశ్వమూర్తి అచ్యుతరామయ్య పనులు పురమాయిస్తుంటే మోహనరావు కిక్కురుమనక అన్నీ చేశాడు 'దేవుడా ఇంకా ఎన్ని పరీక్షలురా' అనుకుంటూ.

పనులు చేస్తూ చేస్తూ మధ్య వీలు చూసుకొని మోహన్ పడక గదిలోకి వెళ్ళాడు. తెగిన వేలు, మరకల మొహం, మొహం మీద పచ్చి పిండి, ఇదీ అవతారం.

'సుగుణా నీవు జ్వరమని పడుకుంటే పీడ వదలుతుందంటివే. ఇలా చూడు. ఆ ముసలి పీనుగు నన్నేవిధంగా చంపుకు తింటున్నాడో.' అని మొర పెట్టుకున్నాడు మోహన్.

'మీకు కావాలిలెండి, నే నెన్నడయినా ఆ గిన్నె తీసి ఈ పక్క పెట్టమంటే

పెట్టారూ? ఇపుడు చూడండి ఆయన చెప్పినట్టు చేస్తున్నారు మీ మగాళ్ళు ఇంతే లెండి.'

'ఆ ఆడవాళ్లు మహా వెలిగించారులే. ఈ దారిని పొయ్యే దరిద్రాన్ని కొంపలోకి తెచ్చిందెవరూ?'

'మీరు తెలివిగలవాళ్ళయితే మరి ఆ పీడను వదిలించుకునే దారి వెతక్కూడదూ.'

'ఇహ దారీ లేదూ తెన్నూ లేదు. నా బుర్ర పని చేయడం మానేసింది. ఇంకో వారం రోజులిలా గడిస్తే నేను అరవిందాశ్రమంలో చేరిపోతా'

'మహా గొప్ప యోచనలెండి. ఇలాటి ఇబ్బందులొచ్చినపుడెల్లా ఆశ్రమాల్లో చేరేట్టయితే ఇహ నేమీ లేదు. మీరు ఏదయినా ఉపాయం ఆలోచించండి. నేనూ ఆలోచిస్తా.'

మోహన్ రావు కాసేపు దూలాలు లెక్కపెట్టాడు. నేలమీద కాలితో రుద్దాడు. పెదవులు బిగించాడు. గడ్డం గోక్కున్నాడు. ఉహూ!

సుగుణ వేలి ఉంగరాన్ని పైకీ కిందకూ జరిపింది. తనకున్న గాజుల్ని లెక్కపెట్టింది. దుప్పటి కొంగుకున్న పోగులన్నీ ముడులేసింది.

'ఆ ఒక ఉపాయం తట్టిందండీ'

ఉలిక్కిపడ్డ మోహన రావు 'ఏమిటది?' అని కుర్చీలోంచి దూకి సుగుణ పక్కన కూర్చున్నాడు.

'మనం ఇక్కణ్ణుంచి తాత్కాలికంగా నయినా కదిలితేగాని ఈ అచ్యుతరామయ్య మనల్ని వదలడు... అందుచేత మనం తిరుపతి వెళ్ళొద్దాం. అక్కడ ఎటూ మా అక్కయ్య వుంది. ఓ వారం, పది రోజుల పాటు అక్కడ వుండి తర్వాత వద్దాం. ఇంతలో ఈయన ఏదో ఏర్పాటయినా చేసుకుంటాడు లేక ఊరికయినా వెళ్ళిపోతాడు.'

'లేక ఉరిపోసుకుంటాడు లేక మురికి గుంటలో పడతాడు లేక' అని కాసేపు ఆలోచించి 'ఏమయినా అవుతాడు! ప్రాణప్రతిష్ట చేసిన దేవుడు కూడా ఇట్లా తిష్ఠ వేసుకు కూచోడు. ఈ మహానుభావుడు మనలను వదిలెనా, పదివేల నమస్కృతులు, అయితే తిరుపతికి రేపే వెళ్ళిపోదాం. ఇంకా ఆలస్యమెందుకూ. అచ్యుతరామయ్యతో చెప్పేస్తా.'

'వద్దు ఇపుడు వద్దు, రేపు బయలుదేరడానికి ఘంటసేపుందనగా చెబుదాం.....'

'అలాగే కానీ'

'మరివాళ నాకు భోజనమో?'

'నీకు జ్వరం కదూ?' అన్నాడు హేళనగా

'పొండి మీరు కూడా'

'అయితే వుండు మరీ. ముద్ద పప్పు చేశాడు, పొట్లకాయ కూరట. ఆయన భోజనం అయిన తర్వాత అయన్నటు పంపించి నీవు తినవచ్చు' అని మోహన్ అంటూండగానే 'మోహనం అబ్బాయ్ మోహనం ఊ పచ్చి మిరపకాయలు కాస్త

గిల్లి పెట్టవోయ్' అని వంటింటి నుండి వారంటు వచ్చింది. పరుగెత్తుకెళిపోయాడు మోహన రావు.

'హతవిధీ! ఈ ఇంట్లో అతిథులెవరూ, గృహస్థులెవరూ?' అని ఒళ్ళు విరుచుకుంది సుగుణ.

****

మరుసటి రోజు – సెప్టెంబరు ఇరవై రెండు.

పొద్దున్నే లేచింది సుగుణ. జ్వరం ఆ రోజు రాలేదు! త్వరగా వంట కానిచ్చింది. ఇద్దరూ భోజనం ముగించుకున్నారు. తిరుపతి ప్రయాణానికి సంసిద్ధులయారు, సామానులూ, బట్టలూ అవీ సర్దుకున్నారు.

'తన భార్యకు ఇంత చక్కటి అలోచన తట్టింది కదా ఔరా సుగుణా!' అని మురిసిపోతున్నాడు మోహన్. ఇవాళతో ఈ జలగ వదిలినట్టేనని తేలికగా తిరుగుతోంది సుగుణ....

సుగుణ చేతిలోకి సంచి తీసుకుంది. మోహన రావు పెట్టె తీసుకున్నాడు. తమ వాకిటికి తాళం వేశారు. బయలుదేరారు. సుగుణ వెనక్కి వెళ్ళి తాళం లాగి చూసి వచ్చింది.

మోహన్ అచ్యుతరామయ్య వద్దకు వెళ్ళాడు. పత్రిక చదువుకుంటున్నవాడల్లా తిరిగి చూసి 'ఏమిటోయ్ పెట్టే గిట్టే? ఎక్కడికీ?' 'టూర్' వెళ్ళొస్తావా?'

'నేనొక్కడినే కాదు మామయ్యా సుగుణ కూడా వస్తోంది.'

'ఓహో!'

'తిరుపతికి వెళ్ళుతున్నాం. ఎల్లుండి నుండి అక్కడ బ్రహ్మోత్సవాలుట. చూసి వద్దామని .....'

'ఆహా తప్పక చూడాల్సిందే. భగవంతుడు, అందులో ఆ వేంకటేశ్వర్ల సన్నిధి కన్నానా?' అని అర క్షణం కళ్ళు మూసుకున్నాడు అచ్యుతరామయ్య. తల ఊపాడు మోహన్.

'అదీకాక సుగుణ ఆరోగ్యం కూడా ఇటీవల ఏమంత బాగుంటం లేదు. ఏదో నాలుగు రోజులపాటు విశ్రాంతిగా వుంటుందనీ'

'అవునవునులే అయితే తిరుపతిలో మీ మకాం ఎక్కడ, సత్రంలోనా?'

'సుగుణ అక్కయ్య అక్కడే వుంది. ఈ పది రోజులూ అక్కడే వుంటాం.'

'ఏవిటీ, తిరుపతిలో సుగుణకొక అక్కయ్య వుందా?' అని కళ్ళు ఇంతింత చేస్తూ అడిగాడు అచ్యుతరామయ్య.

అవునని తల ఊపాడు మోహన్. మధ్య మధ్య రిస్టువాచి చూసుకుంటున్నాడు.-- 'ఇంకా ఎన్ని నిముషాలు ఈ అనుబంధం అన్నట్టు'

'అయితే అబ్బాయ్ నాకు యాభై మూడేళ్ళయింది గానీ ఇంతవరకూ నాకా తిరుపతి వేంకటేశ్వరుడి సందర్శన భాగ్యం దొరకలేదనుకో'

'ప్చ ప్చ' మని పెదవుల్తో చప్పుడు చేస్తూ తన సంపూర్ణ సానుభూతిని వ్యక్తపరచాడు మోహన్

'అలాటి క్షేత్రాలలో మన ఇల్లంటూ ఒకటి లేకపోతే మహా కష్టపడతామోయ్'

'ఒక్కటేమిటి మామయ్యా. లక్షా తొంభై రెండు సమస్యలు బయలుదేరుతాయి' అని అచ్యుతరామయ్య అభిప్రాయానికి తన ఆమోదం తెలిపాడు. అచ్యుతరామయ్య గభుక్కున కుర్చీలోంచి లేచి కూచుని ఇలా అన్నాడు.

'అంచేతా అబ్బాయి మోహనం నే చెప్పొచ్చేదేమంటే ఎలాగు ఇక్కడ మీ అత్తయ్య లేదు గనుకా, నాకు ఆ పరమాత్ముడి దర్శనం మీద చిరకాలంనుండి అభిలాష వుంది గనుకా, ప్రస్తుతం అక్కడ వుండడానికి సుగుణ అక్క ఇల్లంటూ ఉంది గనుకా, నేను మీతో బాటు తిరుపతి వస్తున్నాను. ఇదిగో రెండు నిముషాలలో ధోవతీ అదీ సంచిలో పెట్టుకుని వస్తున్నా. ఇంతలో స్టేషనుకి బండి మాట్లాడు.'

మోహన రావు మెడ వాలిపోయింది. గుమ్మంలో నిల్చుని వున్న ఇల్లాలు సుగుణ వైపు దీనంగా చూశాడు.

'రాకన్ మానవు హాని వృద్ధులు మహారణ్యంబులో దాగినన్' అన్నాయి ఆ చూపులు.

*(ఆనందవాణి, జన. '60)*